ANDHRA JYOTHI
19 MAY 2020

## మద్యం విక్రయాలకు కేబినెట్ ఆమోదం

యానాం, మే 18: మద్యంషాపులు తెరిచేందుకు పుదుచ్చేరి కేబినెట్ నిర్ణయం తీసుకుంది. యానాంలో జనత కర్ఫ్యూకు ముందు మార్చి 19 నుంచి మద్యంషాపులు మూసివేశారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి.నారాయణసామి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా మద్యంషాపులు ఉదయం 7నుంచి సాయంత్రం 7గంటల వరకు తెరిచేందుకు నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్‌కు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు రావాల్సి ఉంది. యానాంలో మద్యంషాపుల వద్ద నిర్వాహకులు భౌతికదూరం పాటించేలా సర్కిల్స్ వేశారు. కర్రలతో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. క్యాబినెట్‌లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆటోకు ఇద్దరు, కారులో నలుగురు ప్రయాణం చేయడానికి అనుమతి ఇచ్చారు.

PRAJA SAKTHI
19 MAY 2020

## నేటి నుంచి మద్యం అమ్మకాలు

**యానాం :** లాక్‌డౌన్ కారణంగా 56 రోజులుగా మూతపడిన మద్యం షాపులు మంగళవారం తెరచుకోనున్నాయి. మద్యం అమ్మకాలు సాగించుకోవడానికి పాండిచేరి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ప్రక్క రాష్ట్రమైన ఎపిలో మద్యం షాపులకు అనుమతి ఇవ్వగా అక్కడ ఏర్పడిన పరిస్థితులు దష్టిలో ఉంచుకొని భౌతిక దూరం పాటించేలా పుదుచ్చేరి ప్రభుత్వం మంగళవారం నుంచి మద్యం అమ్మకాలు సాగించనుంది.

ENADU
19 MAY 2020

## వలస కార్మికుల తరలింపు

జగ్గంపేట, యానాం, అంబాజీపేట, గొల్లప్రోలు: జగ్గంపేటలో చిక్కుకుపోయిన వలస కార్మికులను సోమవారం స్వగ్రామాలకు తరలించారు. హైదరాబాద్ నుంచి 30 మందిని సోమవారం రాత్రి ప్రత్యేక బస్సులో యానాం చేరుకున్నారు. తొండవరం, మాచవరం గ్రామాల్లోని వలస కూలీలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరామర్శించారు. దుర్గాడలో చిక్కుకున్న వారిని స్వస్థలాలకు తరలించేందుకు సోమవారం అధికారులు కాకినాడ పంపించారు.

19 MAY 2020 SAKSHI

# నేటి నుంచి యానాంలో మద్యం విక్రయాలు

- జిల్లాకు అక్రమంగా రవాణా అవుతుందన్న ఆందోళన
- ఒకవైపు కరోనా వైరస్ వ్యాప్తి
- మరోవైపు మందుబాబుల హడావుడి



యానాం బైపాస్ రోడ్డులో మద్యం దుకాణాల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

యానాం: భౌగోళికంగా జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో మద్యం షాపులు మంగళవారం నుంచి తెరుచుకోనున్నాయి. పుదుచ్చేరి ప్రభుత్వం ఈమేరకు అనుమతి ఇవ్వడంతో మద్యం షాపుల వద్ద అమ్మకాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పట్టణ పరిధిలోనూ, యానాం–అమలాపురం బైపాస్ రహదారిలో ఉన్న మద్యం షాపుల వద్ద మద్యం కోసం వచ్చే వారు భౌతిక దూరం పాటించేలా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 22వ తేదీన లాక్‌డౌన్ ప్రారంభం నుంచి యానాంలో మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో, బ్లాక్‌లో మద్యం అమ్మకాలు అత్యధిక ధరలకు సాగాయన్న ఆరోపణలు వచ్చాయి. సంబంధిత అధికారులు సైతం తూతూమంత్రంగా మద్యం షాపులకు సీజ్ వేసి చేతులు దులుపుకున్నారనే పలు విమర్శలు వచ్చాయి. పుదుచ్చేరిలో మాత్రం ఎల్జీ కిరణ్ బేడీ ఆదేశాలతో బ్లాక్ అమ్మకాలకు పాల్పడిన 29 షాపుల లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా పలువురు సిబ్బందిపై కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణకు ప్రత్యేక కమిటీని కూడా వేశారు. ఒక వైపు కరోనా వైరస్ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నందున యానాంలో మద్యం షాపులను తెరవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఏపీలో కంటే తక్కువ ధరలకు యానాం మద్యం లభిస్తుండటంతో.. యానాం సమీపంలోని జిల్లా పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది మందుబాబులు అక్కడి వెళ్లే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. యానాంలో ధరలు తక్కువగా ఉన్నందున ఇక్కడి నుంచి మద్యం భారీగా ఏపీ ప్రాంతానికి అక్రమ రవాణా సాగు ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. తక్కువ ధరకు మద్యం లభిస్తుందని ఏపీ నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే మందుబాబులను ఏ విధంగా కట్టడి చేస్తారనే సందేహాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి.

యానాం: స్థానిక విద్యాశాఖ పరిధిలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉపాధ్యాయుల ఆర్థిక సహకారంతో సమకూర్చిన నిత్యావసరాలను పుదుచ్చేరి ఆరోగ్యశాఖా మంత్రి మల్లాడి కృష్ణారావు పంపిణీ చేశారు. సుమారు రూ.లక్ష విలువ చేసే నిత్యావసర సరుకులు పంచారు.



యానాంలో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నిత్యావసరాలు అందిస్తున్న మంత్రి మల్లాడి కృష్ణారావు

ANDHRA PRABHA 19 MAY 2020
19 MAY 2020

# నేటి నుంచి యానాంలో మద్యం

**పాతధరపై 30శాతం అధికం**



యానాం

లాక్‌డౌన్ మొదలైనప్పట్నుంచి యానాంలో మూతబడ్డ మద్యం దుకాణాలు మంగళవారం నుంచి తెరుచుకోనున్నాయి. ఇంతకు ముందు ధరలపై అదనంగా 30శాతం పెంచి మద్యాన్ని విక్రయిస్తారు. అలాగే ఉదయం 7నుంచి సాయంత్రం 7గంటల వరకే దుకాణాలు తెరిచుంటాయి. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో 15రోజుల క్రితమే మద్యం దుకాణాల్ని తెరిచేసారు. కానీ పుదుచ్చేరి అంతర్భాగమైన యానాంలో మద్యం దుకాణాలకు బంద్

మిగతా 2లో..

## నేటి నుంచి యానాంలో మద్యం

పాటిస్తున్నారు. దీనిపై సోమవారం పుదుచ్చేరిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ సమీక్ష జరిగింది. మద్యం ప్రియుల డిమాండ్‌ను స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మల్లాడి కృష్ణారావు ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. మద్యం ప్రియులు ఆంధ్రప్రదేశ్‌కెళ్ళి మద్యాన్ని తాగాల్సొస్తోందంటూ ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాన్ని కోల్పోతున్నట్లు చెప్పారు. దీనిపై సమీక్ష అనంతరం మంగళవారం నుంచి యదావిధిగా దుకాణాలు తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొనుగోలు సమయంలో తప్పనిసరిగా భౌతికదూరం పాటించాలని ఆదేశాలు జారీ చేసింది.